VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 08 ఆగస్టు 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 34




బోనాల పండగతో 9న మద్యం దుకాణాల మూసివేత

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## కాంగ్రెస్ బలోపేతంపై అధిష్ఠానం దృష్టి



**మూడు జిల్లాలకు అధ్యక్షుల ఎంపికకు పరిశీలకుల నియామకం**

**యువతకు, విధేయులకు పార్టీ, నామినేటెడ్ పదవులు**

తెలంగాణలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సహా సీడబ్ల్యూసీ సభ్యులు, పలువురు సీనియర్ మంత్రులతో దిల్లీలో ఏఐసీసీ పెద్దలు వరుస భేటీలు, సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించారు. పార్టీ సంస్థాగత కార్యక్రమాలు, ఎన్యూమరేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరు, ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాల సరళిపై సుదీర్ఘంగా చర్చించారు.

తెలంగాణలో ప్రభుత్వం, పార్టీ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే.. పలు కీలక సూచనలు చేశారు. పీసీసీ నూతన కార్యనిర్వాహక అధ్యక్షుల నియామకంపైనా ఏఐసీసీ కసరత్తు చేస్తోంది. పాత, కొత్త నాయకుల మధ్య విభేదాలను పార్టీకి నష్టం జరగకుండా సామరస్యంగా పరిష్కరించడం కోసం పీసీసీ పరిశీలకులను నియమించి నివేదికలు తెప్పించుకునే పనిలో ఉంది. అదే విధంగా పనితీరు సరిగ్గా లేని మూడు జిల్లాల అధ్యక్షులను మార్చాలని ఏఐసీసీ నిర్ణయించింది. వారి స్థానంలో కొత్త అధ్యక్షులను నియమించేప్రక్రియ కోసం తాజాగా పీవీ మోహన్, దీపక్ రాథోర్‌లను పరిశీలకులుగా నియమించింది. వీరు ఆయా జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో సంప్రదింపులు జరిపి నూతన అధ్యక్షుల నియామకంపై ఏఐసీసీకి నివేదిక అందచేస్తారు. యువతకు, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టగల నేతలకు కీలక పదవులివ్వాలని ఏఐసీసీ నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని పీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా, నవీన్ పొట్టెంను పీసీసీ సోషల్ మీడియా ఛైర్మన్‌గా నియమించినట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాలపరిమితి ముగిసిన కార్పొరేషన్ల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పదవుల భర్తీపైనా ఏఐసీసీ, పీసీసీల కసరత్తు తుదిదశకు వచ్చినట్లు తెలుస్తోంది.



## కృత్రిమ మేధతో జీఎస్టీ లోపాలకు అడ్డుకట్ట

**సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్**

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరచడంపై సుదీర్ఘ చర్చ**

**ఆదాయ పెంపు మార్గాలపై సీఎం, అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్**

హైదరాబాద్, ఆగస్ట్7: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించడం ద్వారా ఖజానాకు మరింత ఊతం తీసుకురావచ్చని ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపర్చేందుకు ఏఐ ఆధారిత సమాచారంతో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రాబడులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేలా సులభతర వ్యవస్థను తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో

-మిగతా 2 లో..

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

**ఒంటరి పోరాటంతోనూ అధికారం సాధిస్తాం**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడి**



న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 : తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు మిగతా 2లో




## మహిళపై సామూహిక అత్యాచారం

**ఆపై ఫోన్‌లో వీడియోలతో బెదిరింపులు**

**దుండగులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు**

**జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన**

02



## ఆకాశంలో మబ్బుల లొల్లి...

**కాసేపట్లో హైదరాబాద్‌ల ఉరుముల వాన!**

హైదరాబాద్:జనులకు వాతావరణ శాఖోళ్లు, జీహెచ్‌ఎంసీ పెద్దలు గట్టి వార్నింగ్ ఇచ్చిన్రు.. ఇంకో గంటల నగరమంతా ఉరుములు, మెరుపులతో గట్టి వర్షం ధుమ్ము లేపబోతోందంట. ఒక అరగంట పాటు వాన దంచికొట్టేలా ఉందట. రోడ్ల మీద నీళ్లు నిలిచి ట్రాఫిక్ జామ్ అయ్యే ఛాన్స్ ఉంది కాబట్టి బైక్‌లు, కార్లు తోలేటోళ్లు జర మెల్లగా పోవాలె.. లోతట్టు ఏరియాల జనాలు అలర్ట్‌గా ఉండాలి. పనిపాట లేకపోతే ఇంట్లకెళ్లి బయట కాలు పెట్టకుర్రి. ఏమైనా లొల్లి అయితె వెంటనే డీఆర్ఎస్ టీమ్‌కి ఫోన్ కొట్టండని ఆఫీసర్లు సలహా ఇచ్చిన్రు!

## నేతన్నలకిచ్చిన హామీలు అమలు చేయండి



**హైదరాబాద్:**నేతన్నలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. తక్షణమే ఆ హామీలను అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. "తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారింది. భారాస ప్రభుత్వ హయాంలో నేతన్నలకు అందించిన అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి వారిని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, రూ.లక్ష వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5% జీఎస్టీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు.

## విద్యార్థుల ఫీజులు డిస్‌ప్లే చేయాలి పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశం

పాఠశాల నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లోనూ పొందుపరచాలని స్పష్టం చేసింది.

2లో

## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

**పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం**

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**



హైదరాబాద్, ఆగస్ట్ 7 : చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని

-మిగతా 2 లో..



## వర్షాల కోసం వరుణయాగం

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో యాగం**

**పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్ట్ 7 : రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ

## నీటిపారుదల సలహా మండళ్లను పునరుద్ధరించాలి

**ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం**

**మంత్రులు ఉత్తమ్, తుమ్మల, జూపల్లి ఉన్నతస్థాయి సమీక్ష**

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి మంత్రి ఉత్తమ్ శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.



హైదరాబాద్, ఆగస్ట్ 7 : ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో ఈ మండళ్లు తప్పనిసరిగా సమావేశం కావాలని సూచించారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భవిష్యత్ నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, ఆయకట్టు పరిస్థితులను సమీక్షించి ఏయే పంటలు వేయాలో రైతులకు శాస్త్రీయ సూచనలు ఇవ్వాలన్నారు. శనివారం నుంచే సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల

-మిగతా 2 లో..



# కృత్రిమ మేధతో జీఎస్టీ లోపాలకు అడ్డుకట్ట

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం సాయంత్రం అరవింద్ సుబ్రమణియన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జీఎస్టీ, ఎక్సైజ్ శాఖలకు సంబంధించి ఆదాయ పెంపునకు ఉన్న మార్గాలు, ఇరు శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఏఐతో వ్యవస్థలను పటిష్టం చేసుకునే అంశాలపై అరవింద్ సుబ్రమణియన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అరవింద్ సుబ్రమణియన్ మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీతో జీఎస్టీ వ్యవస్థలో లోపాలకు అడ్డుకట్ట వేసేందుకు, పన్ను లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వ శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని సూచించారు. రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుతూనే సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మెరుగుపరిచేలా టెక్నాలజీని వినియోగించాలని వివరించారు. ప్రధానంగా భవన నిర్మాణ సామగ్రి విషయంలో లీకేజీలను అరికట్టే విధంగా మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఏఐ సాయంతో సమన్వయం అవసరమన్నారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తు దశలోనే నిర్మాణ సామగ్రి అవసరాలను, అందుకు అనుగుణంగా పన్నుల అంచనాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ జీఎస్టీలో ఏఐ వినియోగం ద్వారా వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా ఉండాలని సూచించారు. ఈ డేటాతోపాటు మీ--సేవ, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలను కూడా సమీకృతం చేయడం ద్వారా పరిపాలనకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ భేటీలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సి.హెచ్. హరికిరణ్, ముఖ్య పౌరసంబంధాల అధికారి (సీపీఆర్‌వో) గుర్రం మల్సూర్ పాల్గొన్నారు. ఎక్సైజ్‌లో కీలక సంస్కరణల కోసం సూచన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో భాగంగా ఎక్సైజ్ శాఖలో తీసుకురావాల్సిన కీలక సంస్కరణల గురించి అరవింద్ సుబ్రమణియన్ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బార్ అండ్ రెస్టారెంట్లలో విక్రయించే లిక్కర్‌పై వ్యాట్ విధించాలని (తద్వారా బార్లలో విక్రయించే లిక్కర్ ధరలు పెరుగుతాయి), బార్లు పెట్టుకోవడానికి ఆసక్తి ఉన్న వారు, సరఫరాదారులు, అన్ని రకాల బ్రాండ్‌లు తెలంగాణ మార్కెట్‌లోకి సులభంగా ప్రవేశించేలా నిబంధనల్లో మార్పులు తేవాలని సూచించారు. అలాగే లిక్కర్ ధరల నిర్ధారణ (పెంచడం లేదా తగ్గించడం) విధానం కూడా సులభతరంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు లిక్కర్ సరఫరాదారులకు చెల్లింపులు జరపాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌తో పోలిస్తే దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ఎక్కువగా ఎక్సైజ్ ఆదాయం ఉంటోందని.. అయితే క్రమంగా ఇతర రాష్ట్రాల్లో ఇది పెరుగుతోందని చెప్పారు. అదే సమయంలో జీఎస్‌డీపీ, సొంత పన్నుల ఆదాయంతో పోలిస్తే ఎక్సైజ్ ఆదాయం క్రమంగా తెలంగాణలో తగ్గుతోందని సీఎం రేవంత్, అధికారులకు అరవింద్ సుబ్రమణియన్ వివరించారు.

# వర్షాల కోసం వరుణయాగం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.



# చిన్న కాంట్రాక్టర్లపై భారీ పెనాల్టీలు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

వివేక్ వెంకట స్వామి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో మైనింగ్ విభాగంపై సమీక్షించారు. మైనింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ సమీక్షలో చర్చించారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, టీజీఎండీసీ ఎండీ అనుదీప్ దురిశెట్టి, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ బీవీ రావు, మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న చిన్న కాంట్రాక్టర్లపై భారీగా పెనాల్టీలు విధించడం, మెటల్ పర్మిషన్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, నిర్మాణ సామగ్రి లభ్యతలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. మైనింగ్ అధికారుల వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్య లు తీసుకోవాలని మంత్రి కోరారు. హ్యామ్ రోడ్ల కోసం గ్రీన్ చానల్: హ్యామ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు వేగంగా వచ్చేలా గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు.

# కోటీశ్వరులకూ రైతుబంధు ఇస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం విచారణ చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరై రూ.24 కోట్లు గత మే నెలలో చెల్లించామని, మిగిలినది వాయిదాల పద్ధతిలో ఆరు నెలల్లో చెల్లిస్తామని చెప్పారు. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చి రెండేళ్లయినా సొమ్ము చెల్లించలేదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి స్పందిస్తూ "అధికారులు ఏం చేయగలరు? మనకు వచ్చే ఆదాయ-ంమెంత. ఖర్చెంత? రాష్ట్ర బడ్జెట్‌లో జీతాలు, అప్పులకూ పోను.. మిగిలినదంతా సంక్షేమ పథకాలకే వెచ్చించే పరిస్థితి. లబ్ధిదారులు బైక్, ఐఫోన్‌తో ఉచిత బియ్యం కోసం వెళుతున్నారు. కోటీశ్వరులకూ రైతుబంధు ఇవ్వడమేంటి? ప్రభుత్వంపై ఎంత భారం పడుతోంది? భవిష్యత్తులో పిల్లలకు ఏం మిగులుతుంది" అని ప్రశ్నించారు.

## ఒక్క తెల్లకార్డునైనా తొలగించగలరా?

రాష్ట్రంలో ఇన్ని ఉచిత పథకాల అమలుపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. "ఒక తెల్లకార్డునైనా తొలగించగలరా? అలా తొలగిస్తే అదో రాజకీయమవుతుంది. ప్రభుత్వ శాఖాపరమైన వ్యవహారాల్లో ఒక్కో అధికారిపై 3 నుంచి 4 వేల కేసులున్నాయి. ప్రస్తుత అధికారిపై 100కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ అధికారైనా ఏమీ చేయలేరు. రేపు మీరే ముఖ్యమంత్రి అయినా ఏమీ చేయలేని పరిస్థితి.




ఇది రాజకీయ ఉపన్యాసం కాదు. ఆవేదనతో చెబుతున్నా. అప్పులు తీర్చడానికి ప్రభుత్వ భూములను విక్రయిస్తుంటే భవిష్యత్తు తరాల పరిస్థితి ఏమిటి?

## 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు

అప్పు చేసి ఎవరైనా బెంజ్ కారు కొంటారా, ఎర్రబస్సులో వెళ్లే వాళ్లం.. ఎయిర్‌బస్‌లో వెళతామంటే ఆ కుటుంబం ఎంత కాలం నిలబడుతుంది? రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు అందిస్తున్నారు. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇది దీర్ఘకాలం ఆచరణ సాధ్యం కాదు. సమాజం ప్రమాదంలో పడబోతోంది. ఇవన్నీ ఎంతవరకు సాధ్యమో ప్రభుత్వాలే తెలుసుకోవాలి" అని న్యాయమూర్తి అన్నారు. ప్రస్తుత కేసులో చెల్లింపులకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని చెబుతూ విచారణను 19కి వాయిదా వేశారు.

# మహిళపై సామూహిక అత్యాచారం

- ఆపై ఫోన్‌లో వీడియోలతో బెదిరింపులు
- దుండగులను అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన



**జగిత్యాల,ఆగస్ట్7:** జగిత్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసి బాధితురాలిని వీడియో తీసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని రెండు పడకగదుల ఇళ్ల కాలనీలో తనకు తెలిసినవారి ఇంటికి వచ్చింది. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అనే యువకులు సదరు మహిళ ఉన్న ఇంట్లోకి ప్రవేశించి.. ఆమె తనకు సన్నిహితంగా వున్న ఓ వ్యక్తితో కలిసివున్న దృశ్యాలను తమ ఫోన్‌లో చిత్రీకరించారు. తర్వాత ఆమెపై వారిరువురు సామూహిక అత్యాచారానికి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించారు. అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తాము తీసిన వీడియోను పలువురికి పంపిస్తామని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడంతో గురువారం బాధితురాలు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులు వినియోగించిన ఇన్నోవా క్రిస్టా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1 నిందితుడు శివరాత్రి నరేశ్‌పై 13, ఏ-2 నిందితుడు గుర్రం శ్రీకాంత్‌పై 9 పాత కేసులతో పాటు రౌడీ షీట్లు ఉన్నట్లు వివరించారు. ఏ-3 నిందితుడు మారవేని మల్లేశ్‌పై 2, గుర్రం అంజయ్యపై ఒక కేసు గతంలో నమోదై ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై కూడా ప్రత్యేక నిఘావేస్తామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సీఐతోపాటు ఎస్సై సందీప్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



# చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. ఎవఊఖ ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)



రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశర చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశర చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.



# నీటిపారుదల సలహా మండళ్లను పునరుద్ధరించాలి

(మొదటిపేజీ తరువాయి)

కింద వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను రైతులు సాగు చేయవద్దని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఒకసారి నీరు అందినా పంటల తర్వాతి దశలో నీరు అందించడంపై అనిశ్చితి నెలకొందని.. అందువల్ల ప్రతి ఆయకట్టులో ఎంత సాగునీరు అందించగలమో, ఎక్కడ నీటి పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, అధికారులు రైతులకు ముందే తెలియజేయాలని ఆదేశించారు. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయికి చేరుకోనందున ఆయా ఆయకట్టు ప్రాంతాల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటిసరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

# కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ షురూ

## ప్రథమ ప్రాధాన్యం తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా బాధితులకు...


**హైదరాబాద్:** రాష్ట్రంలోని తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా బాధితులు, దివ్యాంగులు చనిపోయినప్పుడు వారి భర్త /భార్యకు వెంటనే సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లను ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం. శుక్రవారం పీఆర్‌ఆర్‌డీలోని డీఆర్‌డీఓలు, మున్సిపల్‌శాఖలోని మున్సిపల్ కమిషనర్లతో సెర్ప్ సీఈఓ, మెప్మా ఇన్‌చార్జ్ దివ్యదేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.దీనికి సంబంధించి సంబంధిత అధికారులకు ఇందుకు అవసరమైన ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. సెర్ప్ రికార్డుల ప్రకారం ఇప్పటికే ప్రాథమికంగా 1,599 మంది తలసేమియా బాధితులను గుర్తించి సర్టిఫికెట్లు ఇచ్చారు. మిగిలిన అర్హులైన బాధితులు కూడా వైద్య ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో దాదాపు 6 వేల తలసేమియా, 1,700 సికిల్‌సెల్ అనీమియా బాధితులున్నట్టు ప్రాథమికంగా అధికారులు గుర్తించినట్టు తెలిసింది. ఆగస్టు 15 నుంచి కొత్తగా రెండున్నర లక్షల చేయూత పింఛన్ల మంజూరుకు పీఆర్‌ఆర్‌డీ కసరత్తు ప్రారంభించింది. వీరిలోనూ వృద్ధులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఏ ప్రాతిపదికన ఏ కేటగిరీలో ఎంత మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలనే దానిపైనా అధికారుల్లోనూ సందిగ్ధత నెలకొంది.



# చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

- చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు
- బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నిర్ణయం
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**జైపూర్, ఆగస్ట్ 7 :** దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ధి: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓ÷ూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# ట్రంప్ ఒత్తిడితోనే 'ఈ20' పాలసీ

## కేజ్రీవాల్ ఆరోపణలు

**న్యూఢిల్లీ :** అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులను సులభతరం చేసేందుకే ఈ20 పాలసీని కేంద్రం అమలు చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. మౌలిక సదు-పాయాలను మెరుగుపరచకుండా, ఇప్పటికే ఉన్న వాహనాలు ఈ20కి అనుకూలంగా ఉన్నాయా? లేదా? అని నిర్ధరించుకోకుండా ప్రభుత్వం ఈ విధానాన్ని బలవంతంగా తీసుకొచ్చిందన్నారు. దిల్లీలో మీడియాతో కేజ్రీవాల్ మాట్లాడారు. "అమెరికా అధ్యక్షుడి ఒత్తిడిని నరేంద్ర మోదీ ప్రభుత్వం తట్టుకోలేక పోతోంది. ఇథనాల్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం అమెరికా. కానీ, దానిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోతోంది. ఆ ఇథనాల్‌కు డిమాండ్ సృష్టించేందుకు భారత్ ఈ20ని బలవంతంగా అమలు చేస్తోంది" అని కేజ్రీవాల్ ఆరోపించారు. గతేడాది అమెరికా నుంచి భారత్ 100 కోట్ల లీటర్ల ఇథనాల్‌ను దిగుమతి చేసుకోగా, ఈ ఏడాది 500 కోట్ల లీటర్లను దిగుమతి చేసుకోనుందని చెప్పారు. అసలు అమెరికానే దేశవ్యాప్తంగా ఈ20ని అమలు చేయలేదని, చాలా వరకు తక్కువ ఇథనాల్ మిశ్రమాన్నే కొనసాగిస్తోందన్నారు. భారత్‌లో ఈ విధానాన్ని ప్రకటించిన తర్వాత, దీనిని అమలు చేసేందుకు మూడేళ్ల గడువు మాత్రమే ఇచ్చిందన్నారు. మౌలిక సదుపాయాలు, లక్షలాది వాహనాలను దీనికి అనుగుణంగా మార్చేందుకు ఈ గడువు సరిపోదన్నారు.

# సోషల్ మీడియా ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరు

## బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఆగస్టు 07 :** సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరని బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో వరుస ఓటములపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై జరుగుతున్న ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రచారంపై ప్రతి కాంగ్రెస్ నేతకు బాధ్యత ఉందని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో స్పోక్స్ పర్సన్లను నియమిస్తామని తెలిపారు. మండల అధ్యక్షులు వారానికి ఓ సారి ప్రెస్ మీట్ పెట్టాలని వారిని ఆదేశించారు.

# ఐఏఎస్ సందీప్ కేసు విచారణలో తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 7 :** కోర్ట్ ధిక్కరణ వ్యవహారంలో తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా హైకోర్టు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై వెయ్యి కేసులు ఉన్నాయని.. అవన్నీ విచారణ చేస్తే జీవిత కాలం జైల్లో ఉండాలని పేర్కొంది. ప్రభుత్వాలు చేసిన తప్పుకు అధికారులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులను హైకోర్టుకు పిలిపించడం బాధగా ఉందని.. తప్పని పరిస్థితుల్లో హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది. ఉచిత పథకాల వల్ల చాలా ప్రమాదం ఉందని.. రైతుబంధు అనేది సంపన్నులు, అధికారులు కూడా తీసుకుంటున్నారని.. ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని హైకోర్టు వ్యాఖ్యానించింది.



# పిఆర్సి వెంటనే ప్రకటించాలి.

## - నల్ల బ్యాడ్జిలతో ఉపాధ్యాయుల నిరసన.

**వేగుచుక్క న్యూస్, మెండోరా:**

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దశలవారీ పోరాట కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మెండోరా మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , మండల ప్రాథమిక పాఠశాల లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈ. ప్రభాకర్, యూ.రమేష్ లు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలని, ఆరు డీఏ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని, డీఎస్సీ-- 2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్‌ను అమలు చేయాలని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, టెట్ రాసే వారికి సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని అన్నారు. గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, రాజేశ్వర్, రాజేందర్, అన్వేష్, లలిత, రవి, సరిత, తులసి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి.



**ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి**

**తహసిల్దార్లతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా**

**ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఆగస్టు 07**

: భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమీక్ష మందిరంలో శుక్రవారం ఆయన అన్ని మండలాల తహసిల్దార్లతో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు ఎన్ని అని ఆరా తీస్తూ, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరుపుతూ ఈ నెలాఖరులోగా అన్నింటిని పరిష్కరించాలని కలెక్టర్ గడువు విధించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీ.ఎం ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వెంటదివెంట అర్జీలను పరిష్కరిస్తూ, వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. పై అంశాలకు సంబంధించి నిర్ణీత నమూనాలో రోజువారీగా తనకు వివరాలు పంపాలని ఆదేశించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ కోసం వచ్చిన దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకుని ఈ నెల 17వ తేదీ లోపు అన్ని ఎఫ్.ఆర్.సి దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కస్టం మిల్లింగ్ కోసం లేవీ ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులను ప్రతి పక్షం రోజులకు ఒకసారి అయిన తప్పనిసరిగా సందర్శిస్తూ, ధాన్యం నిల్వలను పరిశీలించాలని తహసిల్దార్లను ఆదేశించారు. నూతన తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణాల కోసం ఆయా మండలాలలో అవసరమైన స్థలాలను గుర్తిస్తూ, సమగ్ర వివరాలతో నివేదికలు పంపాలని సూచించారు.

**ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ**

ఇదిలాఉండగా, సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత సమయానికి కలెక్టర్ సమావేశ మందిరానికి చేరుకోగా, పలు మండలాల తహసిల్దార్లు గైర్హాజరు కావడాన్ని గమనించి వారి తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత సమయం అనంతరం మరో 15 నిమిషాల వరకు కూడా సమావేశం హాల్ కు చేరుకోలేకపోయిన తహసిల్దర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా రెవెన్యూ అధికారి గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ఆయా మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

# 15 రాష్ట్రాల్లో సైబర్ ముఠాల గుట్టురట్టు

## మొత్తం 49 మంది నిందితుల అరెస్టు

**హైదరాబాద్,ఆగస్ట్7 :** సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణ సహా 15 రాష్ట్రాల్లో విస్తరించిన సైబర్ ముఠాల గుట్టురట్టు చేశారు. మొత్తం 49 మంది నిందితులను అరెస్టు చేసి, రికవరీ చేసిన రూ.98.89లక్షల డబ్బును బాధితులకు రిఫండ్ చేశారు. జులైలో 70 సైబర్ క్రైమ్ సంబంధిత ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రేడింగ్ మోసాలే అత్యధికంగా జరిగాయని.. ఆ కేసుల్లో 29 మందిని అరెస్టు చేశామని వివరించారు. మొత్తంగా 25 డెబిట్‌కార్డులు, 23 మొబైల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జోనల్ సైబర్ సెల్స్ ద్వారా 298 కేసులు నమోదు కాగా.. ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. 128 నకిలీ సోషల్‌మీడియా ప్రొ÷ళ్లు, 36 నకిలీ యాడ్స్‌ను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే కాల్స్ పూర్తిగా నకిలీవేనని పోలీసులు స్పష్టం చేశారు. వాటిని నమ్మొద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# వివాదాస్పద ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు

## ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్7:** వివాదాస్పద ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా తమ పార్టీకి చెందిన ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ కాంగ్రెస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరు కావాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో తమ తమ సభల్లో తప్పనిసరిగా హాజరు కావాలని పార్లమెంటు సభ్యులను కోరింది. ఈ మేరకు రాజ్యసభలోని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ విప్ జారీ చేశారు. ఈ సందర్భంగా 2026 ఆగస్టు 10, 11, 12 తేదీల్లో రాజ్యసభలో చాలా ముఖ్యమైన అంశాలను చర్చకు తీసుకోనున్నట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా సభలో సభ్యులు ఉండాలని, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని కోరారు. మరోవైపు, లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకూ పార్టీ ఇదే విధమైన విప్ జారీ చేసింది. ఆ మూడు రోజుల పాటు కాంగ్రెస్ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొంది. అదేవిధంగా ఇండియా కూటమిలోని అన్ని మిత్రపక్షాలకు ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయా పార్టీల ఎంపీలందరూ హాజరుకావాలని కోరింది. కాగా, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, వచ్చే వారం జరగబోయే తాత్కాలిక ప్రభుత్వ కార్యకలాపాల జాబితాను పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. దాంట్లో ఆ రెండు బిల్లుల గురించి మంత్రి ఎక్కడా ప్రస్తావించలేదు.

# అర్బన్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేత

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ...



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి శుక్రవారం కేంద్ర రోడ్డు మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందేవాడ అదనపు వంతెన ( ఆర్ వో బీ ) మంజూరుచేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద ఆర్ యూబీ ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రెండింటికి రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు. అలాగే నిజామాబాదులోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ.30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగిందన్నారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు నగరాన్ని కలుపుతూ 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను కూడా అందజేశామన్నారు. మరొక రోడ్డు నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం, దుబ్బ మీదుగా కాలూర్ రోడ్డు ను పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

# 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి.

## - అభినందించిన సీపీ సాయి చైతన్య.

**వేగుచుక్క న్యూస్: నిజామాబాద్**




పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 10 మంది హెడ్ కానిస్టేబుళ్లు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు (ఏఎస్ఐలు)గా పదోన్నతి పొందారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు శుక్రవారం ఈ పదోన్నతులు కల్పించారు. పదోన్నతి పొందిన సిబ్బంది నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ను కలిసి అభినందనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గత కొంతకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ప్రమోషన్ రావడంతో సిబ్బందిలో ఆనందం వ్యక్తమైంది. పదోన్నతి పొందిన అధికారులు తమపై పెరిగిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మరింత సేవలందించాలని కమిషనర్ సూచించారు. ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారిలో ఎడపల్లి పోలీస్ స్టేషన్ కు చెందిన కె. శంకర్ (నం.1398), వేల్పూర్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఎస్. కైలాస్ పతి (నం.1300), ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు చెందిన బి. చందూలాల్ (నం.1420), ఎన్ఐబీ నిజామాబాద్ కు చెందిన ఆర్. మోజీరామ్ (నం.1380), ముగ్పాల్ పోలీస్ స్టేషన్ కు చెందిన బి. పాండు (నం.1349), టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఎ. ముత్తన్న (నం.1307), టౌన్-5 పోలీస్ స్టేషన్ కు చెందిన బి. రాజు (నం.1325), ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు చెందిన జి. లక్ష్మణ్ (నం.1326), భీమ్ గల్ పోలీస్ స్టేషన్ కు చెందిన జి. శ్రీనివాస్ (నం.1319), వర్ని పోలీస్ స్టేషన్ కు చెందిన జి.వి. శంకర్ (నం.1313) ఉన్నారు. అదేవిధంగా ఏఆర్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.సి. శర్మ (నం.1433) ఏఆర్ఎస్ఐగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన పోలీస్ సిబ్బందికి పోలీస్ అధికారులు, సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

# విద్యార్థి సమస్యలపై పోరులో కాంగ్రెస్ కంటే సీజేపీదే పైచేయి: శశి థరూర్

**ముంబయి, ఆగస్ట్7:** దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ లేవనెత్తిన అంశాలను కాంగ్రెస్ పార్టీ నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇది వరకే ప్రస్తావించారని ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ అన్నారు. కానీ, సీజేపీకి వచ్చిన స్థాయిలో అప్పుడు ప్రజాస్పందన రాలేదని తెలిపారు. నెల ముందే కాంగ్రెస్ పార్టీ ఈ అంశం లేవనెత్తినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని, ప్రజల నాడి పట్టుకోవడంలో ఎక్కడ విఫలమవుతున్నామో కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. నీట్‌లో అక్రమాలపై దిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా జూన్ 20న సీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ చేపట్టిన ఉద్యమానికి ఎట్టకేలకు కేంద్రం తలొంచాల్సి వచ్చింది. వాస్తవానికి జూన్ 17నే రాజస్థాన్‌లోని కోటాలో ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థి గళం) కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ నిర్వహించారని శశిథరూర్ గుర్తు చేశారు. సీజేపీ వ్యక్తం చేసిన డిమాండ్లను రాహుల్ గాంధీ ముందుగానే ప్రస్తావించారని తెలిపారు. దేశంలో యువతకు ప్రాధాన్యం మరింతగా పెరిగిందని శశిథరూర్ అన్నారు. దక్షిణ ఆసియాలోని రాజకీయ పార్టీలు గతంలో మాదిరిగా సంప్రదాయ రాజకీయాలను కొనసాగించడం కష్టమేనని అభిప్రాయపడ్డారు.

# ఎస్‌బీఐ లాభం రూ.24,113 కోట్లు



ముంబయి: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదిక రూ.24,113 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.21,201.47 కోట్లుగా ఉంది. అంటే ఏడాదితో పోల్చినప్పుడు 13.73 శాతం వృద్ధి నమోదైంది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం రూ.19,642.87 కోట్లుగా ఉంది. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 10.23 శాతం వృద్ధి చెంది రూ.21,121.22 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.19,160.44 కోట్లుగా ఉందని ఎస్‌బీఐ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం గతేడాది రూ.1.35 లక్షల కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది రూ.1.43 లక్షల కోట్లకు పెరిగింది. మొత్తం ఖర్చులు సైతం రూ.1.04 లక్షల కోట్ల నుంచి రూ.1.10 లక్షల కోట్లకు పెరిగాయి. నిరర్థక ఆస్తుల కోసం కేటాయించే ప్రొవిజన్లు రూ.4,934 కోట్ల నుంచి రూ.3,359 కోట్లకు తగ్గాయి. నికర ఎన్‌పీల నిష్పత్తి 1.49 శాతం నుంచి 1.47 శాతానికి తగ్గుముఖం పట్టాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్లు బీఎస్‌ఈలో 2.13 శాతం లాభంతో రూ.1108 వద్ద ట్రేడవుతున్నాయి.






## డాబర్ ఇండియాకు ఊరట...

### ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలపై హైకోర్టు స్టే

ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ డాబర్ ఇండియాకు దిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. వంద శాతం స్వచ్ఛత పేరుతో తేనె, ఆవు నెయ్యి, నూనెలు వంటివి విక్రయించొద్దంటూ ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన నిషేధాజ్ఞలపై హైకోర్టు స్టే విధించింది. విచారణకు అవకాశం లేకుండా నిషేధం విధించడం సరికాదని అభిప్రాయపడింది. తదుపరి విచారణ తేదీ వరకు స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. తమ ఉత్పత్తులు 100% స్వచ్ఛమైనవని.. ప్రకృతిసిద్ధంగా సమీకరించినవి, స్వచ్ఛతకు హామీ, రసాయన రహితమైనవి అన్న ప్రచారంతో తేనె, ఆవునెయ్యి, వంటనూనెలు, యాపిల్ సైడర్ వెనిగర్, కొబ్బరినూనె, కొబ్బరినీళ్లు, కొబ్బరిపాలు వంటివి విక్రయించొద్దని దిగ్గజ డాబర్ ఇండియాను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇటీవల ఆదేశించింది. ఈ ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఉందని తెలిపింది. దీనిపై డాబర్ ఇండియా దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు ప్రాథమిక న్యాయ సూత్రాలను ఉల్లంఘించేవిగా ఉన్నాయని డాబర్ ఇండియా తరఫు సీనియర్ న్యాయవాది వాదించారు. కనీసం షోకాజ్ నోటీసులు గానీ, విచారణ గానీ జరగ్గకుండా ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. డాబర్ ఇండియాకు గతంలో నోటీసులు జారీ చేసినట్లు కేంద్రం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణ వరకు నిషేధంపై స్టే విధించింది.

## అందుకే.. హేజిల్‌వుడ్ నాకు బౌలింగ్ చేయనన్నాడు

### ఛెతేశ్వర్ పుజారా



మిస్టర్ 'నయా వాల్' ఛెతేశ్వర్ పుజారాకు ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్ చేసేందుకు ఆసక్తి చూపించలేదట. వీరిద్దరూ ప్రత్యర్థులుగా దిగిన మ్యాచ్‌లో కాదు సుమా..! పుజారా - జోష్ ఒకే జట్టులో ఉంటూ నెట్స్‌లో సాధన చేసే సమయంలోనే ఇది జరిగింది. ఆ విషయాలను పుజారా ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించాడు. పుజారా, జోష్ హేజిల్‌వుడ్ సీఎస్‌కే తరఫున ఐపీఎల్‌లో కలిసి ఆడారు. అంతకుముందు బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ప్రత్యర్థులుగా బరిలోకి దిగి పోటీపడ్డారు. "2018-19, 2021 ఆస్ట్రేలియాతో జరిగిన సిరీసుల్లో జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో చాలా బంతులు ఆడా. ఆ తర్వాత నన్ను ఐపీఎల్‌లో సీఎస్‌కే తీసుకుంది. అప్పటికే జోష్ కూడా చెన్నై జట్టుతోనే ఉన్నాడు. తొలిసారి నేను బ్యాటింగ్ చేసేందుకు నెట్స్‌లోకి వెళ్లా. కానీ, హేజిల్‌వుడ్ నాకు బౌలింగ్ చేసేందుకు విముఖత చూపించాడు. 'అతడికి బౌలింగ్ చేయను' అని అనేశాడు. మేమిద్దరం సహచరులమైనా సరే తిరస్కరించాడు. దానికి కారణం కూడా ఉంది. కొన్ని నెలల ముందే జోష్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నా. అందుకే, నాకు బౌలింగ్ చేయకుండా ఆగిపోయినట్లు జోక్ చేశాడు. నెట్స్‌లోనూ ఎప్పుడూ నాకు బౌలింగ్ చేయలేదు" అని పుజారా గుర్తు చేసుకున్నాడు. "నేను కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించా. షారుక్ ఖాన్ ఓనర్. తొలిసారి అతడిని కలవడం ఓ అభిమానిగా మరిచిపోలేని క్షణం. అయితే, క్రికెట్ విషయాకొచ్చేసరికి ఆయన మా ఓనర్. ఫ్రాంచైజీ సృష్టించిన వాతావరణం చాలా బాగుంటుంది. గొప్ప ఆటగాళ్లతో కలిసి పనిచేయడం, వారి నుంచి నేర్చుకొనేందుకు వీలుంటుంది. మనలోని క్రికెట్ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకొనేందుకు సదావకాశం మెరుగుపర్చుకోవచ్చు" అని పుజారా అన్నాడు.




## సన్‌రైజర్స్ ఆటగాళ్లపై ముంబై ఇండియన్స్ కన్ను!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ అంచనాలను అందుకోలేకపోయింది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి తీవ్రంగా నిరాశపర్చింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యమైన ప్రదర్శన కాదు. జట్టు నిండా స్టార్లు ఉన్నా అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై పతనాన్ని శాసించింది. ఈ ఘోర పరాజయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై ఇండియన్స్.. వచ్చే సీజన్‌లో టైటిల్ గెలవడమే లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. జట్టును వీడాలని నిర్ణయించుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యాను అడ్డు పెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్లను ఇతర జట్ల నుంచి ట్రేడ్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు చెందిన ఇషాన్ కిషన్, శివాంగ్ కుమార్ లేదా దేశీయ పేసర్, ఒక ఓవర్‌సీస్ పేసర్‌ను జట్టులోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ ట్రేడ్ డీల్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా చెప్పడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'సీఎస్‌కే, కేకేఆర్ కాకుండా ముంబై ఇండియన్స్ ఇతర జట్ల వైపు కూడా చూడవచ్చు. హార్దిక్ పాండ్యాకు బదులుగా ఒక భారతీయ బ్యాటర్, ఒక విదేశీ/భారతీయ బౌలర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ముంబై డీల్‌కు ప్రయత్నించవచ్చు. గతంలో ముంబై ఆటగాడిగా ఉన్న ఇషాన్ కిషన్‌ను హార్దిక్ పాండ్యాకు బదులుగా వారు అడగవచ్చు. ఇషాన్ కిషన్, శివాంగ్ కుమార్ లాంటి ఆటగాడు వస్తే హార్దిక్ పాండ్యాకు సమాన విలువ లభిస్తుంది.'అని అశ్విన్ పేర్కొన్నాడు.అయితే అశ్విన్ చెప్పిన మాటలు వాస్తవమేనని పలువురు క్రికెట్ పండిట్స్ అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ముంబై ఇండియన్స్‌కు ఇషాన్ కిషన్ వంటి ఇండియన్ టాపార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. అలాగే శివాంగ్ కుమార్ వంటి స్పిన్నర్‌తో పాటు ఓవర్‌సీస్ పేసర్, ఇండియన్ పేసర్ కూడా కావాలి. హార్దిక్ పాండ్యాను అడ్డు పెట్టి తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ముంబై.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సంప్రదింపులు జరపవచ్చు. అంతేకాకుండా ఇషాన్ కిషన్ గతంలో ముంబై ఇండియన్స్‌కు మెరుగ్గా ఆడాడు. ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉండటమే కాకుండా ఇండియన్ ఐకాన్ ప్లేయర్‌గా ఎదుగుతున్నాడు. కాబట్టి అతని కోసం ముంబై గట్టిగా ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే ఈ డీల్‌కు కావ్యమారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ అంగీకరించపో వచ్చని ఆ జట్టు ఫ్యాన్స్ అంటున్నాడు. నితీష్ రెడ్డి రూపంలో జట్టులో మంచి పేస్ ఆల్‌రౌండర్ ఉన్నాడని, హార్దిక్ పాండ్యా కోసం ఇషాన్ కిషన్ వంటి కీలక బ్యాటర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ వదులుకోదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# వార్మప్ మ్యాచ్..

## ప్రభావం చూపించని భారత బౌలర్లు




శ్రీలంక-11తో వార్మప్ మ్యాచ్‌లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. తొలి రోజు ఆట ముగిసే సరికి శ్రీలంక ఎనిమిది వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. క్రీజ్‌లో కేషర నువాంత (9), దిలుమ్ సుదీరా (1) ఉన్నారు. నిషాన్ మదుష్క (66), రవిందు రసాంత (71), సోనాల్ దినుష (51) అర్ధశతకాలతో అలరించారు. పవన్ రత్నాయకే (39), విక్రమసింఘె (31), పసిందు సూరియ బండారా (35) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 2, కుల్‌దీప్ యాదవ్ 2, మానవ్ సుతార్ 2, గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టుకు ఓపెనర్లు నిషాన్, రవిందు మంచి ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు 110 పరుగులు జోడించారు. భారత పేస్ బౌలర్లు సిరాజ్, ప్రసిద్ధ్‌కు వికెట్ దక్కలేదు. వీరిద్దరూ 21 ఓవర్లు వేసి 76 పరుగులు ఇచ్చారు. బుమ్రా లేకుండానే శ్రీలంకతో టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఈ క్రమంలో వికెట్ లేకపోవడం భారత శిబిరంలో కాస్త ఆందోళన కలిగించేదే. కొత్త బౌలర్ సారాంశ్ జైన్ (11-0-54-0) కూడా ఇబ్బంది పడ్డాడు. అయితే, కుల్‌దీప్‌తోపాటు జడేజా, సుతార్ నాణ్యమైన బౌలింగ్‌తో వికెట్లు దక్కాయి. వార్మప్ మ్యాచ్ తొలి రోజు ఆటకు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరంగా ఉన్నాడు. గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా చేతి వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో అతడికి బదులు కేఎల్ రాహుల్ సారథ్యం నిర్వర్తించాడు. రెండో రోజు గిల్ ఫిట్‌గా ఉంటే బరిలోకి దిగే అవకాశం ఉంది. అదీ సాధ్యం కాకపోతే.. నేరుగా ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరగనున్న తొలి టెస్టులోనే ఆడతాడు.

## ముంబై ఇండియన్స్‌కు సూర్యకుమార్ గుడ్ బై!




ముంబై ఇండియన్స్ స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టు వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే అతను జట్టు నుంచి తప్పుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. టీమ్‌లో కొనసాగలేనని సమాచారమిచ్చినట్లు వార్తలు వచ్చాయి. హార్దిక్ పాండ్యాను ఇతర జట్టుకు ట్రేడింగ్ చేసి తమకు కావాల్సిన ఆటగాళ్లను తీసుకోవాలనే యోచనలో ముంబై ఇండియన్స్ ఉంది. ఇప్పటికే సీఎస్‌కే, కేకేఆర్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఇలా ఉండగానే సూర్యకుమార్ యాదవ్ ట్రేడ్ డీల్ వార్తలు కూడా తెరపైకి వచ్చాయి. ముంబై ఇండియన్స్ జట్టులో కొనసాగేందుకు సూర్యకుమార్ యాదవ్ సుముఖంగా లేడని, అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని తెలుస్తోంది. అయితే లక్నో జట్టులో చేరేందుకు సూర్య విముఖత చూపినట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ నుంచి అతని నిష్క్రమణ ఖాయమైనప్పటికీ.. అతను ఏ జట్టులో చేరుతాడనేది ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంలో నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ తీవ్రంగా నిరాశపర్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య.. 2026 సీజన్‌లో మాత్రం 13 మ్యాచ్‌ల్లో 2 హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. అతని పేలవ ఫామ్ ముంబై విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ నేపథ్యంలోనే సూర్యతో పాటు పలువురు కీలక ఆటగాళ్లను తొలగించాలని ముంబై మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. హార్దిక్ పాండ్యాను కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ట్రేడ్ చేసేందుకు చర్చలు జరుగుతుండగా.. సూర్య ట్రేడ్ డీల్‌పై క్లారిటీ లేదు. అయితే సూర్య నిష్క్రమణపై ముంబై ఇండియన్స్ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో సూర్య.. టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో కూడా చోటు కోల్పోయాడు.

## తలుపు వేసి ఉంటే ఎవరికీ ఎంట్రీ లేదు

### ధోనీ రూమ్ రూల్ చెప్పిన అజింక్య రహానే



భారత క్రికెట్ చరిత్రలో ఎంఎస్ ధోనీ సృష్టించిన ఇంపాక్ట్ మరువలేనిది. మైదానంలో ఎంతో ప్రశాంతంగా ఉండే ధోనీ, మైదానం వెలుపల కూడా యువ ఆటగాళ్లకు సలహాలు సూచనలు ఇస్తుంటాడు. విదేశీ టూర్లు లేదా ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్లు స్వేచ్ఛగా వచ్చి మాట్లాడటానికి, అతడి రూమ్ ఒక అడ్డాగా మారేది. ఈ క్రమంలో టీమిండియాతో పాటు చెన్నై సూపర్ కింగ్స్, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ జట్ల తరఫున ధోనీతో కలిసి ఆడిన అజింక్య రహానే ఆయన రూమ్ కల్చర్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'ఓవర్‌ల్యాప్ క్రికెట్' యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన రహానే, ధోనీ ఎంతో ప్రశాంతమైన, సాధారణమైన మనిషి అని కొనియాడాడు. "హోటల్‌లో ఆయన గది తలుపులు దాదాపు 24 గంటలూ తెరిచే ఉండేవి. జట్టులోని 10 నుంచి 15 మంది ఆటగాళ్లు, ఒక్కోసారి జట్టు మొత్తం ఆయన గదిలోనే గడిపేవారు. అయితే అక్కడ అందరూ తప్పక పాటించాల్సిన ఒకే ఒక నిబంధన ఉంది. అదేమిటంటే ధోనీ రూమ్ డోర్ క్లోజ్ చేసి ఉంటే, ఎవరూ లోపలికి వెళ్లడానికి అనుమతి ఉండదు. ఇది పేపర్‌పై రాయని ఓ రూల్" అని రహానే వెల్లడించాడు. మరోవైపు, కాలి గాయం కారణంగా ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. 40 ఏళ్లు పైబడ్డ ధోనీ ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడంతో అతడి భవిష్యత్తు క్రికెట్ కెరీర్‌పై సందేహాలు నెలకున్నాయి. 2011 నుంచి 2023 మధ్య కాలంలో రహానే 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. జట్టు సాధించిన పలు చారిత్రాత్మక విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.




## పడిన మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు నేల చూపులు చూశాయి. సెన్సెక్స్ 455.59 పాయింట్ల నష్టంతో 78,499.17 వద్ద ముగియగా.. నిఫ్టీ 65.35 పాయింట్ల నష్టంతో 24,570.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.20గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 83 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4300 డాలర్లపైనే కొనసాగుతోంది.



## గూగుల్ మ్యాప్స్‌లో ఇక ఫుడ్ ఆర్డర్, హోటల్ సెర్చ్!

గూగుల్ మ్యాప్స్ కొత్త రూపు సంతరించుకుంటోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు జోడించుకుంటూ వినియోగదారులకు మరింత చేరువవుతోంది. కేవలం దారి చూపించే సాధనంగానే కాకుండా ఇకపై ఫుడ్ ఆర్డర్, హోటల్ సెర్చ్ వంటివీ చేయొచ్చు. 'ఆస్క్ మ్యాప్స్' పేరిట ఈ మేరకు కొన్ని సదుపాయాలను జోడించినట్లు గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది.

గూగుల్ మ్యాప్స్‌లో కొత్త ఫీచర్లు ఇవీ..

- ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడ ఏదైనా తినాలనిపిస్తే వేరేగా రెస్టరంట్ల కోసం వెతికే పని లేకుండా ఆస్క్ మ్యాప్స్‌లోనే ఈ సదుపాయం పొందొచ్చు. మీకు కావాల్సిన రెస్టరంట్లను వెతకడం, కావాల్సిన వంటకాలను నేరుగా కార్ట్‌కు యాడ్ చేయడం వంటివి చేయొచ్చు. ఇదే తరహాలో హోటళ్లు వెతకడం, కాన్సర్టులు, కామెడీ షోలకు టికెట్ బుకింగ్‌కు సంబంధించిన లింకులూ పొందొచ్చు.
- మీ జీమెయిల్‌లో ఉన్న ప్రయాణ వివరాలను (ఫ్లైట్ టికెట్లు, హోటల్ బుకింగ్‌లు) అనుసంధానించుకుని, దానికి తగిన విధంగా ప్రయాణ సూచనలు పొందొచ్చు. గూగుల్ మ్యాప్స్ ఇకపై మీ పాత సంభాషణలనూ గుర్తుంచుకుంటుంది. కాబట్టి ప్రయాణ ప్లానింగ్‌ను గతంలో ఎక్కడ ఆపారో అక్కడి నుంచే కొనసాగించవచ్చు. బస్సులు, మెట్రో, రైళ్లు, ఫెర్రీల వివరాలను లైవ్‌లో తెలుసుకునే సౌకర్యమూ తీసుకొచ్చారు.
- భారత్‌లో ఇంగ్లిష్‌లోనే కాకుండా హిందీలోనూ ఆస్క్ మ్యాప్స్‌లో ప్రశ్నలు అడిగి హోటళ్లు, రెస్టారెంట్లు, పర్యాటక ప్రాంతాల వివరాలు తెలుసుకోవచ్చు. భారత్, అమెరికా సహా 150కి పైగా దేశాల్లో ఈ సదుపాయాలను రోల్ అవుట్ చేసింది. ఫుడ్ ఆర్డర్, ఈవెంట్ సెర్చ్ ఫీచర్లు ప్రస్తుతానికి అమెరికాలో అందుబాటులోకి వచ్చాయి. దశలవారీగా ఇతర దేశాల్లోనూ తేనున్నారు.